

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:25 ఆదివారం
సహర్ 4:53 సోమవారం

ఆట మొదలైందా?





మల్టీప్లెక్స్ వద్ద పోలీసులు, పట్టుబడ్డ నగదు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లాలో రాజకీయ ఆట మొదలైందా.. అంటే ఔననే సమాధానమే వస్తున్నది. సరిగ్గా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడడానికి 18 గంటల ముందే బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కుడిభుజంలా ఉండే కరీంనగర్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ బంధు వర్గానికి చెందిన ప్రతిమ మల్టీప్లెక్స్‌పై స్పెషల్ బ్రాంచి పోలీసులు దాడి చేయడం రాజకీయంగా కలకలం సృష్టిస్తున్నది. ఈ దాడిలో పోలీసులు 6.67 కోట్ల రూపాయలు స్వాధీనం చేసుకోవడం మరోవైపు ముందు రోజే కేసీఆర్ తనయ కల్వకుంట్ల కవితను ఈడీ పోలీసులు అరెస్టు చేయడం బీఆర్‌ఎస్ పార్టీలో కలవరం మొదలైంది.

● రాజకీయ కార్యకలాపాల కేంద్రంగా..

బోయినపల్లి వినోద్‌కుమార్ కరీంనగర్‌లో నివాసముంటున్నా ఆయన రాజకీయ కార్యకలాపాలు అన్నీ ప్రతిమ మల్టీ ప్లెక్స్ కేంద్రంగానే జరుగుతాయి. పలు కీలక సమావేశాలు ఈ హోటల్‌లోనే నిర్వహిస్తారు. ఒకరకంగా చెప్పాలంటే బీఆర్‌ఎస్ రాజకీయ కేంద్రంగా మల్టీప్లెక్స్ ఉంటూ వస్తున్నది. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కరీంనగర్‌లో ఎన్నికల కదనభేరి సభలో పాల్గొనగా ఆ సభ ఏర్పాట్లు కూడా ఈ హోటల్ కేంద్రంగానే జరిగాయి. కేసీఆర్ సభ సందర్భంగా జన సమీకరణ, ఇతర ఏర్పాట్ల విషయంలో ఆర్థిక లావాదేవీలన్నీ ఈ హోటల్ నుంచే జరిగాయి. ఈ నేపథ్యంలోనే ఇక్కడ నిధులు ఉన్నట్లు ఎవరో సమాచారం ఇవ్వడంతోనే పోలీసులు దాడులు నిర్వహించారని ప్రచారం జరుగుతున్నది. ఉమ్మడి జిల్లా పరిధిలోని రెండు పార్లమెంట్ స్థానాలలో విజయం సాధించడంపై బీఆర్‌ఎస్ గట్టి నమ్మకం పెట్టుకున్నది. కేసీఆర్‌కు కుడిభుజంలా ఉండే వినోద్‌కుమార్‌ను ఓడించి ఈ స్థానాన్ని కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ ఆశిస్తుండగా, సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉన్నది. దీంతో ఇక్కడ గట్టి పోటీ ఏర్పడి రాజకీయ ప్రాధాన్యం ఉన్న కేంద్రంగా మారింది. గెలుపే లక్ష్యం గా పెట్టుకున్న అన్ని రాజకీయపార్టీలు ప్రత్యర్థుల కార్యక్రమాలపై దృష్టిసారించి పనిచేస్తున్నాయని, అందులో భాగంగానే ప్రతిమపై దాడులు జరిగాయని అనుకుంటున్నారు.

● పక్కా సమాచరంతో..

కచ్చితమైన సమాచారంతోనే పోలీసులు దాడులు నిర్వహించి 6.67 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ సమాచారమిచ్చింది ఎవరు అన్నదే ఇప్పుడు ప్రశ్నగా మారింది. బీఆర్‌ఎస్‌లోనే ఉంటూ అన్ని విషయాలు తెలిసిన వారే సమా చారాన్ని అందించారా లేక రాజకీయ కోణంగా ఇతర పార్టీలవారు ఫిర్యాదు చేశారా అన్నది చర్చనీయాంశంగా మారింది. సమాచారమెవరిచ్చినా పోలీసుల దాడుల్లో పెద్ద మొత్తంలో డబ్బులు దొరకడం బీఆర్‌ఎస్ పార్టీని ఇరకాటంలో పడవేసింది. ప్రతిమ హోటల్‌లో దొరికింది అవినీతి సొమ్మేనని, పార్లమెంట్ ఎన్నికల కోసం హోటల్‌లో డబ్బు దాచిపెట్టారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రతిమ గ్రూప్ పలు వ్యాపారాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న 6 కోట్ల 67 లక్షలు పెద్ద మొత్తమేమీ కాదని బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. హోటల్ మేనేజర్ డబ్బు విషయంలో సరైన సమాధానం చెప్పక పోవడంతో ప్రత్యర్థి పార్టీలు ఆరోపణలు చేయడానికి ఆస్కారం కలిగింది. అటు కవిత అరెస్టు, ఇటు ప్రతిమ మల్టిప్లెక్స్‌పై పోలీసుల దాడులు బీఆర్‌ఎస్ వర్గాల్లో కలకలం రేకెత్తిస్తున్నాయి. బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు, ఇతర నేతలు భూకబ్జాల కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ పలువురు జైళ్లకు వెళ్లడం, మరికొందరిపై విచారణ జరుగుతుండడంతో ఇప్పటికే ఆ పార్టీశ్రేణులు నైతికంగా బలం కోల్పోయాయి. ఇప్పుడు ఈ పరిణామాలన్నీ పార్టీకి నష్టం కలిగించేవిగా మారే ప్రమాదం లేక పోలేదని ఆందోళన పడుతున్నారు.

- ●కరీంనగర్‌లో రాజకీయ కలకలం
- ● ప్రతిమా మల్టిప్లెక్స్‌పై పోలీసుల దాడి
- ● రూ. 6.67 కోట్ల సీజ్
- ● బీఆర్‌ఎస్ ఎన్నికల డబ్బేనంటున్న కాంగ్రెస్

పోలీసులకు పట్టుకున్నది అవినీతి సొమ్మే...

- ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ నాయుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్‌కు చెందిన వ్యాపార సంస్థ ప్రతిమ మల్టీఫ్లెక్స్‌లో పట్టుకున్నది పార్లమెంట్ ఎన్నికల కోసం తరలించిన అవినీతి సొమ్మని మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు, ఎన్నికల కోడ్ ప్రకటించే రోజు వరకు వినోద్ కుమార్‌కు చెందిన ఈ వ్యాపార సంస్థలో కోట్ల రూపాయలు దాచి పెట్టారంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తమ వ్యాపార సంస్థలలో బీఆర్‌ఎస్ నేతలు ఎన్ని కోట్ల రూపాయలు అవినీతి సొమ్మును దాచి పెట్టారో అని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, వారి బంధువు లు, అనుచరులు, బినామీల ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో తనిఖీలు నిర్వహించాలని రాష్ట్ర పోలీసులను కోరారు.

● ఓట్లు కొనేందుకే వినోద్ డబ్బు తెచ్చాడు...

- కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ ప్రతిమ మల్టీప్లెక్స్‌లో పోలీసులకు దొరికిన 6.67 కోట్ల ముమ్మాటికి ఎన్నికల డబ్బేనని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు కొనేందుకు బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ తీసుకువచ్చాడని కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు విమర్శించారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోవడం, ఈ గెలువడం కష్టమైన నేపథ్యంలో ఓటుకు నోటు లెక్కన కొనేందుకు వినోద్‌కుమార్ పెద్ద ఎత్తున డబ్బును పట్టుకొచ్చారన్నారు. ఇంకా చాలా డబ్బు వారి వద్ద ఉందని, దొరికింది చాలా తక్కువని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిమ మల్టీప్లెక్స్ వినోద్‌కుమార్ బంధువులదని, అందుకే అక్కడ పెట్టారని అన్నారు. వినోద్‌కుమార్‌కు సంబంధించిన బంధువుల ఇళ్లలో కోట్ల రూపాయలు దాచి ఉంచారని, అదంతా కూడా బయటకు తీస్తామని రాజేందర్‌రావు తెలిపారు.

ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలి..



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

కరీంనగర్ టౌన్, మార్చి 16: ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిందని, ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలయ్యేలా అధికారులు చూడాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ ఎన్నికల ఫిర్యాదుల కోసం అన్ని జిల్లాల్లో 24 గంటలు పాటు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ సమయంలోనైనా ఫిర్యాదులు వచ్చినా స్వీకరించాలని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రచారానికి సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్స్‌ను వెంటనే అధికారులు తొలగించాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వే లైన్స్ టీమ్‌లు ఏర్పాటు చేసి ఆదివారం నుంచి విధులు నిర్వర్తించేలా చూడాలని సూచించారు. రాష్ట్రాలు, జిల్లాల సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని, వాహనాల తనిఖీలను విస్తృతంగా చేపట్టాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు అన్నీ ఇప్పటి నుంచే ప్రారంభించాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీజీపీ రవి గుప్తా మాట్లాడుతూ పోలీసులు నిరంతరం విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మొహంతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్, మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్, ఏసీపీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



కరీంనగర్ ధర్నాలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

కవిత అరెస్టుపై బీఆర్‌ఎస్ నిరసనలు

కరీంనగర్, మార్చి 16: ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణ చౌక్‌లో, రామడుగు మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. చొప్పదండి మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మానకొండూరు, హుజూరాబాద్, సైదాపూర్ మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు.

ముగిసిన ప్రజాహిత యాత్ర

కరీంనగర్ టౌన్, మార్చి 16: భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేపట్టిన ప్రజాహితయాత్ర ముగిసింది. యాత్ర చివరి రోజు శనివారం ఆయన తిమ్మాపూర్, బెజ్జంకి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడే కంటే కొద్దిసేపు ముందే ఆయన యాత్రను ముగించారు. తొలిదశలో సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 మండ లాలు, రెండు మున్సిపాలిటీలతోపాటు 81 గ్రామాల్లో 215 కిలో మీటర్ల యాత్ర చేపట్టారు. మలిదశలో హుస్నాబాద్, హుజురా బాద్, చొప్పదండి, మాన కొండూర్ అసెంబ్లీ నియోజక వర్గాల్లోని 29 మండ లా ల్లోని 131 గ్రామాల్లో సంజయ్ ప్రజాహిత యాత్రను 538 కిలో మీటర్లు కొనసాగించారు. సిద్దిపేట, హన్మకొండ జిల్లాలకు సంబం ధించి కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మండలాల్లో కూడా యాత్రను పూర్తిచేసి పార్టీశ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. సంజ య్ రెండు విడతల్లో చేపట్టిన ప్రజాహిత యాత్రకు ప్రజల నుంచి చక్కటి స్పందన లభించిందని, ప్రజలు గ్రామాల్లో స్వాగతం పలుకగా పార్టీశ్రేణులు, అభిమానులు ఆయనతో కలిసి యాత్రలో పాల్గొన్నారని పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

● **తిమ్మాపూర్:** ఎంపీ బండి సంజయ్ తలపెట్టిన ప్రజాహిత యాత్ర శనివారం మద్యాహ్నం మండలంలోని రేణికుంట, కొత్తపల్లి, రామకృష్ణకాలనీ, తిమ్మాపూర్ గ్రామాలలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బిజెపి శ్రేణులు, మహిళలు ఆయన ఘన స్వాగతం పలికారు. ముందుగా రేణికుంట గ్రామానికి చేరుకున్న బండి సంజయ్ అక్కడ యాదవ సంఘ భవ నానికి ప్రహరిగోడ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కొత్తపల్లిలో రామాలయానికి భవననిర్మాణానికి భూమి పూజ చేశారు. తిమ్మాపూర్ గ్రామంలో స్ట్రీట్ లైట్లను ప్రారంభించారు. అనంతరం ... నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుగొండ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవరెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడ్డం అరుణ్, నాయ కులుజి.తిరుపతి రెడ్డి, చింతం శ్రీనివాస్, చింతం వరలక్ష్మి పాల్గొన్నారు.



తిమ్మాపూర్ మండలం రేణికుంటలో ప్రజలకు అభివాదం చేస్తున్న బండి సంజయ్

పంటలకు సాగునీరు విడుదల చేయాలి

● కలెక్టరేట్ ఎదుట బీజేపీ ధర్నా

సుభాష్‌నగర్, మార్చి 16: రాష్ట్ర ప్రభుత్వం పంటలకు సాగు నీరు ప్రణాళికాబద్ధంగా విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. ఇప్పటికైనా సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని వినియోగించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతుల విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. జిల్లాలో అనేక రిజర్వాయర్లు ఉన్నా సాగునీటి కోసం అన్నదాతలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు తలెత్తాయన్నారు. కాలువల ద్వారా సాగునీరు అందించి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించిందన్నారు. కనీసం కుంటలు, చెరువులు నింపుదామన్న సోయి, కాలువలకు నీళ్ళు ఇచ్చి పంటలను కాపాడుదమన్న ధ్యాస రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. ఎస్సారెస్పీ కింద సాగవుతున్న భూములకు చివరి ఆయకట్టు ప్రాంతాలకు, ఇతర ఇరిగేషన్ ప్రాజెక్టులకింద సాగు అవుతున్న పంట పొలాలకు తక్షణం సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళపల్లి శ్రీనివాస్, మాడ వెంకటరెడ్డి, బత్తుల నారాయణ, దండు కొమురయ్య, బొంతల కళ్యాణ్‌చంద్ర, ఎడమ సత్యనారాయణరెడ్డి, సుధాకర్, జానపట్ల స్వామి, అసెంబ్లీ కన్వీనర్లు జగన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గౌతమ్, శ్రవణ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, రాజు, సంపత్, శ్రీనివాస్, తిరుపతి, నాంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాగునీటికి కటకట

● మెట్ట ప్రాంతాల్లో ఎండుతున్న వరి, మొక్కజొన్న పంటలు ● అడుగంటిన భూగర్భ జలాలు

హుజూరాబాద్, మార్చి 16: సాగునీటికి రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది రోజులుగా ఎండలు ముదిరాయి. వరి, మొక్కజొన్న పంటలు ఎండి పోతున్నాయి. మెట్ట ప్రాంతంలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు నీళ్లు అందక పోవడంతో వేసిన పంటలన్నీ నెర్రెలుబారాయి. ఈ వానకాలంలో ఒకేసారి భారీ వర్షం పడింది, దీంతో చెరువులు, కుంటలన్ని నిండి మత్తళ్ల పడ్డాయి. ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయాయి. రైతులు యాసంగిలో వరిసాగు తగ్గించారు. అయినా నీరు సరిపోవడం లేదు. వరి పొట్ట దశలో ఉన్న సమయంలో బావుల్లో నీరు ఒక్కసారిగా తగ్గాయి. దీంతో వేసిన మొక్కజొన్న, వరి పంటలు ఎండిపోతున్నాయి. ఎంతో పెట్టుబడి పెట్టి శ్రమ పడ్డ రైతుకు నీళ్ల లేక పంటలు ఎండిపోతుండడంతో గుండెలు బాదుకుంటున్నాడు. శంకరపట్నం, సైదాపూర్, హుజూరాబాద్ మండలాల్లోని మెట్ట ప్రాంతాల్లో పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.



హుజూరాబాద్ మండలం కాట్రపల్లిలో ఎండిపోతున్న వరి పొలాలు

సాగునీటి కోసం అన్నదాత భగీరథ ప్రయత్నం

చిగురుమామిడి: మండలంలో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. దీంతో రైతులు సాగునీటి కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. బొమ్మనపల్లికి చెందిన కత్తుల చంద్రమౌళి అనే రైతుకు రెండు ఎకారాల వ్యవసాయా భూమి ఉన్నది. గత సంవత్సరం రెండు బోర్లు వేశాడు. చుక్క నీరు రాలేదు. ఈ సంవత్సరం ఫిబ్రవరి నుంచి మార్చి 15 వరకు నాలుగు బోర్లు వేశాడు. చుక్క నీరు రాలేదు. పది లక్షల రూపాయల వరకు అప్పులయ్యాయి. పశువులకు అందించేందకు కూడా నీళ్ల లేకపోవడంతో ఇతరుల బావుల వద్ద నుంచి తెచ్చుకుంటున్నారు. గ్రామంలో చంద్రమౌళి లాగా అనేక మంది రైతులు బోర్లు వేసి అప్పుల పాలయ్యారు.



నాలాంటి పరిస్థితి ఏ రైతుకు రావద్దు..

- కత్తుల చంద్రమౌళి, బొమ్మనపల్లి

మాకు రెండెకరాల భూమి ఉన్నది. అందులో ఇప్పటి వరకు ఆరు బోర్లు వేసి పది లక్షల వరకు అప్పుల పాలయ్యాం. మా లాంటి పరిస్థితి ఏ రైతుకు రావద్దు. ఏం చెయ్యాలో తోచడం లేదు. నాలాంటి పరిస్థితి ఏ రైతుకు రావద్దు.

రోడ్డు ప్రమాదంలో మతి స్థిమితం లేని వ్యక్తి మృతి

ఎల్లారెడ్డిపేట, మార్చి 16: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మతి స్థిమితం లేని వ్యక్తి(53) శనివారం రాత్రి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డుపై నుంచి నడుచుకుంటూ తిమ్మాపూర్ వైపునకు వెళుతున్న మతిస్థిమితం లేని వ్యక్తిని ఎల్లారెడ్డిపేట నుంచి కామారెడ్డి వైపునకు ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖనిలో గంజాయి పట్టివేత

● పోలీసుల అదుపులో నలుగురు యువకులు

కోల్‌సిటీ, మార్చి16: గోదావరిఖని గంగానగర్‌లో శనివారం తెల్లవారుజామున నలుగురు యువకుల వద్ద నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పాత నేరస్థుల నుంచి ఈ గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

హుజూరాబాద్‌లో ఒకరి అరెస్టు

హుజూరాబాద్, మార్చి 16: హుజూరాబాద్ పట్టణంలోని రంగనాయకుల గుట్ట సమీపంలోని ఒడ్డెర కాలనీకి చెందిన దుండుగుల వెంకటేష్ అనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శనివారం టౌన్ సీఐ బొల్లం రమేష్ తెలిపారు. వెంకటేష్‌పై గతంలో గంజాయి కేసు నమోదు కాగా పరారీలో ఉన్నాడు. పట్టణ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా వెంకటేష్ పోలీసులను చూసి పారిపోతుండగా, పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేటలో వడగళ్ల వాన



అడవిపదిరలో కురిసిన వడగళ్లు



వన్‌పల్లిలో వడగళ్ల వానకు నేలకొరిగిన వరిపంట

వీర్నపల్లి, మార్చి 16: వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లి, శాంతినగర్, అడవి పదిర, రంగంపేట గ్రామాలతో పాటు పలు తండాల్లో శనివారం సాయంత్రం వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. ఈ అకాల వర్షానికి పొట్టదశకు వచ్చిన వరిపంట భారీస్థాయిలో దెబ్బతినే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షానికి పలుచోట్ల వరిపంట నేలకొరగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అడవిపదిరలో రెండు కరెంట్ స్తంభాలు నేలకూలాయి. ఇంకా 15 నుంచి నెల రోజులకు కోతలు ప్రారంభం కానుండడంతో ఇంతలోనే వడగళ్లతో రైతులకు కడగండ్లు మిగిల్చనుందని వారు వాపోయారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. ఆకాశమంతా మేఘావృతమై వానపడడంతో రహదారులు నీటితో నిండిపోయాయి. మండల కేంద్రంతో పాటు పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, దుమాల, అల్మాస్‌పూర్, రాజన్నపేట, గుండారం, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో వడగళ్ల వాన పడింది. పొట్టదశకు వచ్చిన వరి పంట చేతికందకుండాపోతోందని రైతులు ఆందోళన చెందారు. నష్టం మిగుల్చుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రుద్రంగిలో దుకాణాల్లోకి చేరిన వరదనీరు

రుద్రంగి, మార్చి 16: రుద్రంగి మండల కేంద్రంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలోని కోరుట్ల - వేములవాడ ప్రధాన రహదారికి ఇటీవల ఎత్తు పెంచడంతో దుకాణ సముదాయాలు కిందికి కావడంతో శనివారం రాత్రి కురిసిన వర్షానికి బస్టాండ్ నుంచి ఇందిరాచౌక్ వరకు గల దకాణాల్లోకి వరద నీరు వెళ్లింది. ఇందిరాచౌక్‌లోని ఓ బట్టల దుకాణంలో బట్టలు తడిసి ముద్దయ్యాయి. వరద నీరు దుకాణాల్లోకి రాకుండా మురికికాలువలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు, దుకాణదారులు కోరుతున్నారు.



దుకాణంలోకి చేరిన నీరు

పోలీసు కస్టడీకి మాజీ తహసీల్దార్

కరీంనగర్ అర్బన్, మార్చి 16: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడమే కాకుండా బాధితుడి భూమిని ఆక్రమణకు పాల్పడిన కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను పోలీసులు 48 గంటల కస్టడీకి తీసుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ఉదయం 10 గంటలకు కస్టడీకి తీసుకోగా సోమవారం ఉదయం 10 గంటలకు మళ్లీ జైలుకు తరలించనున్నారు. కస్టడీకి తీసుకున్న అనంతరం ఎమ్మార్వోను అతని ఇల్లు, గెస్ట్‌హౌస్‌లకు తీసుకువెళ్లి సోదాలు నిర్వహించారు. ఎమ్మార్వోపై నమోదైన కేసుకు సంబంధించి కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



శ్రీనివాస్‌ను అతని ఇంటికి తీసుకెళ్తున్న పోలీసులు

కొండగట్టులో ముగిసిన పవిత్రోత్సవాలు

మల్యాల, మార్చి 16: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధానంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న పవిత్రోత్సవాలు శనివారంతో ముగిసాయి. చివరి రోజు స్వామి వారికి క్షీరాభిషేకం, సహస్ర నాగవల్లిదళ అర్చన, పట్టు వస్త్రాలంకరణ, దివ్య ప్రబంధ పారాయణం, హవనం, పూర్ణాహుతి, దేవతా ఉద్వాసనం, శ్రీ స్వామి వారికి పవిత్రధారణ, మహదాశీర్వచనం, పండిత సన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో పవిత్ర ప్రధానం, సహస్రదీపాలంకరణ, గరుడ వాహన సేవ కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. పవిత్రోత్సవాల ముగింపు రోజు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ట్రస్టీ మారుతీ, ఏఈవో అంజయ్య, ఆలయ పర్యవేక్షకులు సునీల్, శ్రీనివాస్‌శర్మ, ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● నూతన విగ్రహాల ప్రతిష్ఠ

ఆలయంలో నూతనంగా సీతా,రామ,లక్ష్మణ, భేతాళుడు, పంచముఖ ఆంజనేయస్వామి, శ్రీదేవి, భూదేవి, వెంకటేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వీటిని పలువురు భక్తులు దేవస్థానానికి అందించగా ప్రతిష్ఠించడానికి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ప్రాణప్రతిష్ఠ అనంతరం యాగశాల, ప్రధాన ఆలయంలో ప్రతిష్ఠించారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్స్ స్వాధీనం

● రెండు క్రషర్ల యజమానులపై కేసు నమోదు

తంగళ్లపల్లి, మార్చి 16: అనుమతి లేకుండా జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్స్ వినియోగిస్తున్న క్రషర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి తెలిపారు. శనివారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ ఎస్‌హెచ్‌వో , ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో గోపాల్‌రావుపల్లి గ్రామానికి చెందిన మీరాల భాస్కర్ జిల్లెల్ల గ్రామ శివారులోగల శాంభవి స్టోన్ క్రషర్ మేనేజింగ్ పార్టనర్‌గా ఎనిమిది సంవత్సరాలుగా క్రషర్ వ్యవహారాలు చూసుకుంటున్నాడు. శాంభవి క్రషర్ పక్కనే ఉన్న గుట్టను బ్లాస్ట్ చేయడానికి సిద్దిపేటకు చెందిన విజయ్ ఎక్స్‌ప్లోజివ్ షాప్‌లో ఎక్స్‌ప్లోజివ్స్‌ను తీసుకువచ్చి ఆ గుట్టకు అమర్చి గుట్టను పేల్చి బండను సేకరిస్తున్నారు. నాలుగు నెలల క్రితం సిద్దిపేటలోని విజయ్ ఎక్స్‌ప్లోజివ్స్ షాప్ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఎక్స్‌ప్లోజివ్స్‌లను భాస్కర్ కొనుగోలు చేసి క్రషర్ పరిసర ప్రాంతాల్లో డస్ట్‌లో డంప్ చేశాడు.ఈ క్రమంలో గుట్టను బ్లాస్ట్ చేయడానికి కొంత ఎక్స్‌ప్లోజివ్స్ బయటకు తీసి గుట్టను బ్లాస్ట్ చేయడానికి చూస్తున్న క్రమంలో సమాచారం అందుకుని క్రషర్ దగ్గర భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని 83 ఎంఎం ,సైజ్ గల 87 జిలేటిన్ స్టిక్స్, 35 ఎంఎం సైజ్ గల 249 జిలాటిన్ స్టిక్స్, 20 మీటర్ల రెడ్ వైర్ స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఓగులపూర్ గ్రామా శివారులో ఉన్న చేమంతి స్టోన్‌క్రషర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చేమంతి స్టోన్ క్రషర్ యజమానులు అయిన సిరిసిల్ల పట్టణం రెడ్డివాడకు చెందిన మదుకు శ్రీకాంత్‌రెడ్డి, పెద్దూర్ గ్రామానికి చెందిన కసారం సాగర్‌బాబు అనే ఇద్దరు వ్యక్తులు స్టోన్ క్రషర్‌లో అక్రమంగా అనుమతి లేకుండా ఫ్యూజ్‌లు, డిటోనేటర్స్, జిలెటన్ స్టిక్స్‌లు నిల్వ ఉంచినట్లు సమాచారం అందిదన్నారు. క్రషర్ లో తనిఖీలు నిర్వహించి 196 ఫ్యూజ్‌లు, 25 ఎంఎం జిలటిన్‌స్టిక్స్ 1087 , డిటోనేటర్స్ 897ఉండగా వాటిని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



స్వాధీనం జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్స్

ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలి : బీజేపీ

కరీంనగర్ టౌన్, మార్చి 16: జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్రధాని మోదీ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో పార్లమెంట్ ముఖ్య నేతల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. తప్పుడు హామీలు, భూటకపు మాటలతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచినా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఆ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో 12 పార్లమెంట్ స్థానాల్లో గెలవబోతోందన్నారు. కవిత అరెస్టుకి బిజేపి కి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

ఓదెల మార్చి 16: మండల కేంద్రానికి చెందిన బిటెక్ విద్యార్థి ముద్దసాని వెంకట సాయి (27) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బీటెక్ పూర్తి చేసి నాలుగేళ్లు అయినా కూడా, ఉద్యోగం రాలేదు. ఉద్యోగం కోసం పలు పోటీ పరీక్షలు రాసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో మనస్థాపం చెందిన వెంకటసాయి శుక్రవారం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకుహైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

జ్యోతినగర్, మార్చి 16: స్థానిక ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన ఎం వెంకటయ్య(85) అనే వృద్ధుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. మృతుని కొడుకు, కోడలు ఒక శుభకార్యం నిమిత్తం శుక్రవారం హైదరాబాద్ వెళ్లారు. వృద్ధాప్యంతో జీవితంపై విరక్తి చెంది ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడని, ఈ మేరకు మృతుని కుమారుడు బచ్చు శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ధర్మారం,మార్చి16: మండలంలోని నర్సింహులపల్లి గ్రామంలో ఓ వ్యవసాయ బావిలో శనివారం మధ్యాహ్నం క్రేన్ సహాయంతో పూడిక తొలగిస్తుండగా జరిగిన ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన లక్కాకుల రాజయ్యకు చెందిన వ్యవసాయ బావిలో గ్రామంలో ఉంటున్న సూర వెంకటస్వామి, తండ్రి సైదులు, తల్లి కళమ్మ, మరో ఇద్దరు కలిసి క్రేన్ సహాయంతో పూడిక తొలగిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం సమయంలో వ్యవసాయ బావిలో సూర వెంకటస్వామి(22) పూడికను క్రేన్ డబ్బాలో పోస్తుండగా డబ్బాను ముట్టుకోవడంతో కరెంట్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతిచెందాడు. సంఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

లారీ బోల్తా : డ్రైవర్ మృతి

సుల్తానాబాద్, మార్చి 16: సుల్తానాబాద్ పట్టణంలోని రాజీవ్ రహదారిపై శనివారం తెల్లవారుజాము ఐదున్నర గంటలకు లారీ బోల్తా పడింది. క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రగాయాలతో ఉన్న డ్రైవర్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించగా చికిత్స చెందుతూ మృతిచెందాడు. హైదరాబాద్ నుంచి చెత్త లోడ్‌తో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాజానంద్‌గామ్‌లోని చెత్త ఆధారిత పవర్ ప్లాంట్‌కు వెళుతుండగా సుల్తానాబాద్ ఐబీ చౌరస్తా దాటిన తర్వాత మూలమలుపు వద్ద లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. మహారాష్ట్రలోని గుర్ధియా జిల్లా సిర్పూర్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రాజన్ లారీ క్యాబిన్‌లోనే తీవ్ర గాయాలతో ఇరుక్కుపోయారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్, పోలీసులు, గాజుల రాజమల్లు తదితరులు అస్పత్రికి తరలించారు. అతను చికిత్స పొందుతూ మృతిచెందగా, క్లీనర్ హితేంద్ర మున్నాలాల్ తీవ్రంగా గాయపడ్డాడు.

వెంకయ్యకుంటలో చోరీ

ముస్తాబాద్, మార్చి 16: మండలంలోని వెంకయ్యకుంటలో శుక్రవారం చోరీ జరిగింది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కంకణాల మల్లవ్వ తన ఇంటికి తాళం వేసి తన కొడుకు ఇంటి దగ్గర పడుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బీరువాలోదాచి ఉంచిన రూ. 86 వేల నగదును చోరీ చేశారు. బంగారు రింగులు, పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చొప్పదండి 16 : చొప్పదండి శివారులోని డి 87 కెనాల్ వద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యమయింది. ఎస్ఐ ఉపేంద్రచారి కథనం మేరకు పట్టణంలోని ఝాన్సీ స్కూల్ దగ్గర కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం ఉందని లష్కర్ గోపాల్ ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని బయటకి తీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. 15 రోజుల క్రితమే చనిపోయినట్లు తెలుస్తుందని మృతుడు సుమారుగా 30 నుండి 40 సంవత్సరాల వయస్సు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట ,మార్చి 16: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం బైకు అదుపుతప్పి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని బండలింగంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి రాగుల దేవయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

బావిలో పడి వ్యక్తి మృతి

రాయికల్, మార్చి 16: ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇటిక్యాలలో జరిగింది. ప్రకాశం జిల్లాకు చెందిన ఇంటూరి సుభాష్ (25) కూలీ పనుల నిమిత్తం ఇటిక్యాలకు వలస వచ్చాడు. ఈ నెల 10వ తేదీన రాత్రి 8 గంటల ప్రాంతంలో సుభాష్ బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి ఇటిక్యాల శివారులోని వ్యవసాయ బావిలో పడి చనిపోయాడు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్, మార్చి 16 : మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులోని లింగాపూర్ క్రాస్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఆగి ఉన్న ఓ లారీని వెనుక నుంచి టాటా ఏసీ ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరూ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం గ్రామానికి చెందిన కెమ్మసారపు తిరుపతి(40) శుక్రవారం హుజూరాబాద్‌లో ఉండే తన అమ్మను చూసేందుకు అదే గ్రామానికి చెందిన ఎండీ గఫార్‌తో కలిసి టాటా ఏసీ ఆటోలో బయల్దేరాడు. ఆటో సింగాపూర్ గ్రామ శివారులోని లింగాపూర్ క్రాస్ వద్దకు రాగా, చీకట్లో నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది.ఈ ఘటనలో తిరుపతి అక్కడికక్కడే మృతి.. చెందగా గఫార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య కెమ్మసారపు వెంకటలక్ష్మీ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

మెట్‌పల్లిలో గుర్తుతెలియని వాహనం ఢీ

● ముగ్గురికి తీవ్ర గాయాలు

మెట్‌పల్లి, మార్చి, 16 : మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన ఆరుపేట గ్రామ బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలపాలయ్యారు. శనివారం రాత్రి ఆరపేట బస్టాండ్‌లో బాదినేని భూమక్క, నల్ల లక్ష్మి, శనిగారపు తుక్కవ్వలు బస్సు దిగి రోడ్డు దాటుతుండగా వేగంగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. స్థానికులు గమనించి ముగ్గురిని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలం పరిశీలించి గాయాలపాలైన మహిళల వద్ద వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాజన్న సేవలో ప్రముఖులు

వేములవాడ టౌన్, మార్చి 16 : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉపలోకయుక్త జస్టిస్ వి నిరంజన్‌రావు కుటుంబ సమేతంగా శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం వారికి శ్రీస్వామి వారి నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ సూపరిండెంట్ నాగుల మహేష్ రాజన్న ప్రసాదాన్ని అందేశారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ రాజన్న ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వస్తి స్వాగతం పలికారు. అనంతరం శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొని కోడెమొక్కు చెల్లించుకున్నారు.

తండ్రిపై గొడ్డలితో తనయుడి దాడి

రాయికల్, మార్చి 16: మండలంలోని ధర్మాజీపేట గ్రామానికి చెందిన మ్యాకల అంజయ్య తన తండ్రి గంగారెడ్డిని డబ్బుల విషయంలో శుక్రవారం రాత్రి గొడ్డలితో దాడి చేసినట్లు రాయికల్ ఎస్సై అజయ్ పేర్కొన్నారు. దీంతో గంగారెడ్డి తలకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గంగారెడ్డి చెల్లెలు బద్ది సులోచన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రధాని పర్యటన సందర్భంగా జగిత్యాలలో ట్రాఫిక్ ఆంక్షలు

జగిత్యాల టౌన్, మార్చి 16 : జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 18న దేశ ప్రధాన మంత్రి మోదీ పర్యటన సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ శనివారం పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు భారీ వాహనాల అనుమతి లేదన్నారు. ఆదివారం ఎలాంటి డ్రోన్లు ఎగురవేయడానికి అనుమతి లేదన్నారు. పదవ తరగతి పరీక్షలు ప్రారంభం ధృష్యా విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు వీలైనంత త్వరగా చేరుకోవాలన్నారు.

వాహనాల మళ్లింపు

కరీంనగర్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనాలు ధరూర్ కెనాల్ నుంచి బైపాస్ ద్వారా కోరుట్ల వైపు వెళ్లాలి. నిజామాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్లే వాహనాలు జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి బైపాస్ ద్వారా ధరూర్ కెనాల్ మీదుగా వెళ్లాలి.

ధర్మపురి నుంచి కరీంనగర్ వైపు వెళ్లేవారు తమ వాహనాలను జగిత్యాల రూరల్ మండలం పొలాస నుంచి తిమ్మాపూర్ బైపాస్ మీదుగా ధరూర్ కెనాల్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కరీంనగర్ నుంచి ధర్మపురి వైపు వెళ్లేవారు తమ వాహనాలను ధరూర్ కెనాల్ మీదుగా తిమ్మాపూర్ బైపాస్ మీదుగా పొలాస గ్రామం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.

ధర్మపురి నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనాలను జగిత్యాల రూరల్ మండలం పొలాస నుంచి తిమ్మాపూర్ బైపాస్ మీదుగా ధరూర్ కెనాల్ మీదుగా బైపాస్ రోడ్‌లో కోరుట్ల వైపు వెళ్లేలా దారి మళ్లించారు. ట్రాఫిక్ ఆంక్షలను ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీసులు తెలిపారు.



కరీంనగర్‌లో, తిమ్మాపూర్ మండలంలో శనివారం రాత్రి వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు.

- ఆంధ్రజ్యోతి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, కరీంనగర్

రెనే ఆసుపత్రిలో ఉచిత ఐవీఎఫ్ చికిత్సకు దంపతుల ఎంపిక

సుభాష్‌నగర్, మార్చి 16: శ్రీలక్ష్మీ మహేశ్వర చారిటబుల్ ట్రస్టు, రజనీ ఫెర్టిలిటీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో అందించే ఉచిత ఐవీఎఫ్ చికిత్సకు సంబంధించి లక్కీ డ్రాలో దంపతులను ఎంపిక చేశారు. శనివారం నగరంలోని రెనే ఆసుపత్రిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి యూట్యూబర్ గంగవ్వ ముఖ్య అతిథిగా హాజరై దంపతులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రెనే ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తన తల్లి బంగారి లక్ష్మి జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. సీనియర్ ఐవీఎఫ్ వైద్యురాలు డాక్టర్ బంగారి రజనీప్రియదర్శిని మాట్లాడుతూ సంతాన లేమి సమస్యల గురించి ప్రజల్లో చైతన్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రాచారి, జనరల్ మేనేజర్ డాక్టర్ అరవింద్‌రావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'అల్ఫోర్స్ సంస్కృతి'

కరీంనగర్ టౌన్, మార్చి 16: నగరంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ జెన్‌నెక్స్ట్ స్కూల్ ఆవరణలో అల్ఫోర్స్ సంస్కృతి పేరుతో నిర్వహించిన స్కూల్ వార్షికోత్సవం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శనివారం జరిగిన ఈకార్యక్రమానికి ఎస్సార్ఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మధుసూదన్‌రెడ్డి, అల్ఫోర్స్ అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని అంశాల్లో పట్టు సాధించాలని సూచించారు.

గణిత ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, మార్చి 16: అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్‌లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో విద్యార్థులు గోల్డ్‌మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సాధించారు. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులను అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి ప్రశంసాపత్రాలతో అభినందించారు.

'ఎమ్మెల్సీ కవిత అరెస్టు రాజకీయ కుట్ర'

కరీంనగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆడుతున్న రాజకీయ కుట్రలో భాగంగానే బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవిత అరెస్టు జరిగిందని ఆ పార్టీ నేత రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు అన్నారు. లిక్కర్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ కూడా నిందితుడై ఉండగా అతనిని అరెస్టు చేయకుండా కేవలం కవితను అరెస్టు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

కరీంనగర్ టౌన్, మార్చి 16: పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని శనివారం వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు నగునూరి రాజేందర్ ఆధ్వర్యంలో నగరంలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, కార్పొరేటర్ వంగల శ్రీదేవి పవన్‌కుమార్, పట్టణ సంఘం అధ్యక్షుడు నగునూరి రాజేందర్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఏవి మల్లికార్జున్ పాల్గొన్నారు. అనంతరం వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో యాచకులకు అల్పాహారం పంపిణీ చేశారు.

●సుభాష్‌నగర్: వాసవీ క్లబ్ రీజియన్ చైర్ పర్సన్, భరోసా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలను నిర్వహించారు.

హుజూరాబాద్ ఆర్డీవోగా రమేష్‌బాబు బాధ్యతలు

హుజూరాబాద్, మార్చి 16: హుజూరాబాద్ ఆర్డీవోగా రమేష్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఆర్డీవో రాజును హైద్రాబాద్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సిద్దిపేటలో పనిచేస్తున్న రమేష్‌బాబును హుజూరాబాద్ ఆర్డీవోగా నియమించారు. ఈ మేరకు రమేష్‌బాబు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

శంకరపట్నం డీటీ, ఆర్ఐ బాధ్యతల స్వీకరణ

శంకరపట్నం, మార్చి 16: శంకరపట్నం మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా బండి రమేష్, ఆర్ఐగా సుగూరి ప్రత్యూషలు శనివారం బాధ్యతలు స్వీకరించినట్లు తహసీల్దార్ అనుపమ తెలిపారు. గతంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన కిరణ్‌కుమార్‌రెడ్డి బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో కరీంనగర్ జిల్లాలో సివిల్ సప్లయ్ డీటీగా పనిచేస్తున్న బండి రమేష్‌ను శంకరపట్నం డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించారు. అలాగే ఆర్ఐగా పనిచేస్తున్న లక్ష్మారెడ్డి వీణవంకకు బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో వీణవంక నుంచి ప్రత్యూష శంకరపట్నం ఆర్ఐగా బాధ్యలు చేపట్టారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

శంకరపట్నం, మార్చి 16: శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 36మంది పదో తరగతి విద్యార్థులకు శనివారం మాజీ సర్పంచ్ కాటం వెంకటరమణారెడ్డి పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలన్నారు. కన్నాపూర్ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు ఆల్‌ది బెస్ట్ చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

హుజూరాబాద్‌రూరల్,మార్చి16: మండలంలోని శాలపల్లి ఇందిరానగర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు వేల్పుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని సింగాపూర్ గ్రామంలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ప్రణవ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జడల అశోక్, ఎనగందుల సమ్మయ్య, సమ్మయ్య, రాజేశం, కొక్కుల శ్రీనివాస్, జెడుల సుధాకర్, కంది నరసింహారెడ్డి, కంది ప్రభాకర్‌రెడ్డి, మద్దెల బన్నీ, జడత సత్తయ్య, దుబాసి దేవి తదితరులు ఉన్నారు.

ప్రాంగణ నియామకాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ఎంపిక



విద్యార్థులు, అధ్యాపకులతో శ్రీచైతన్య చైర్మన్ రమేష్‌రెడ్డి

తిమ్మాపూర్, మార్చి16: స్థానిక శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్, ఎంబీఏ2024 బ్యాచ్‌కు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు హైదారాబాద్‌కు చెందిన వెరైటీ నాలెడ్జ్ ఐటి సొల్యూషన్స్‌లో ట్రైనీ ఉద్యోగాలకు ఎంపికైనట్లు శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 5.4లక్షల వార్షిక వేతనం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్ రమేష్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జి.వేంకటేశ్వర్లు, ఎ.ప్రసాద్, ఇతర అధ్యాపకులు ఉన్నారు.

కవిత అరెస్టుకు నిరసనగా ఆందోళనలు

గణేశ్‌నగర్, మార్చి16: ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ శనివారం బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టారు. బీఆర్ఎస్ నగర శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో నిరసన చేపట్టారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లహరిశంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తెలంగాణ ప్రజలు గమనించాలన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అధిక స్థానాలు సాధిస్తుందని అక్రమ అరెస్టులకు తెర తీసిందన్నారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, మాజీ సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, కరీంనగర్ ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ మండల అధ్యక్షులు పెండ్యాల శ్యాం సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.



చొప్పదండిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

●హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బండ శ్రీనివాస్, గందె రాధిక, వర్దినేని రవీందర్‌రావు, కొలిపాక శ్రీనివాస్, సంపత్‌రావు, సత్యనారాయణరావు, లావణ్య, శ్రీదేవి, రమ, సుశీల, శ్రీనివాస్, అయిలయ్య పాల్గొన్నారు.

●సైదాపూర్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచులు కొండ గణేష్, కొత్త రాజిరెడ్డి పాల్గొన్నారు.

●మానకొండూర్: మానకొండూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరై మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్‌ను దెబ్బతీయడానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై కవితను అరెస్టు చేశారని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శేఖర్‌గౌడ్, సిద్ధం వేణు, ఆయా మండలాల అధ్యక్షులు గంట మహిపాల్, రావుల రమేశ్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

●రామడుగు: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం రామడుగులో ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గంట జితేందర్‌రెడ్డి, నాయకులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, కలిగేటి లక్ష్మణ్, నాగి శేఖర్, ఎలుకపల్లి లచ్చయ్య, వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

●చొప్పదండి: చొప్పదండిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, గడ్డం చుక్కారెడ్డి, నాయకులు మందారపు అజయ్, మాచర్ల వినయ్, కొత్త గంగారెడ్డి, మేకల తిరుపతి, పిట్టల సత్యం పాల్గొన్నారు.

●చిగురుమామిడి: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త వినీత-శ్రీనివాస్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కరీంనగర్ రూరల్, మార్చి 16: కొత్తపల్లి మండలం ఎలగందల్ గ్రామంలో హైమాస్ట్ లైట్లు ప్రారంభించడంతో పాటు, ఓపెన్ జిమ్‌కు ఎంపీటీసీ సభ్యుడు మంద రమేష్‌గౌడ్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో చింతకుంట ఎంపీటీసీ పట్టెంశారద లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంజాల స్వామి, గుండ మల్లేశం, ఆరెమల్లేశం, ఆరె పర్శరాం, జెట్టిసత్యం, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ హయాంలో అవినీతి'

సుభాష్‌నగర్, మార్చి 16: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి రాజ్యమేలిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్‌కు చెందిన ప్రతిమ మల్టీప్లెక్స్ హోటల్లో శనివారం జరిపిన సోదాల్లో రూ.6కోట్ల 65 లక్షల అవినీతి సొమ్ము దొరికిందని ఆరోపించారు. అవినీతి సొమ్ముతో దొరికిన బీఆర్ఎస్ నేత వినోద్‌కుమార్ ఇపుడు ఏం ముఖం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతారని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మద్యం, డబ్బు పంచి ఓట్లు దండుకోవాలనే దురుద్దేశంతోనే వినోద్‌కుమార్ కోట్ల రూపాయాలను దాచి పెట్టడం జరిగిందన్నారు. ఈ ఒక్కచోటనే ఆరు కోట్ల రూపాయలను దొరికితే రాష్ట్రం మొత్తం మీద బీఆర్ఎస్ నేతల వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహిస్తే ఎన్ని కోట్ల రూపాయలు బయటపడతాయోనని తెలంగాణ ప్రజలు గుర్తించాలన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని చిత్తుగా ఓడించిన రాష్ట్ర ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేసి, అవినీతి పరులను రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలన్నారు. అవినీతి సొమ్ముకు నిలయంగా మారిన ప్రతిమ మల్టీప్లెక్స్ హోటల్ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు, రహమత్ హుస్సేన్, నూనె గోపాల్‌రెడ్డి, కంకణాల అనిల్‌కుమార్, రాజిరెడ్డి,

'పారమిత'లో వార్షికోత్సవం

కరీంనగర్ టౌన్, మార్చి 16: నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలో వికసిత రెండు రోజుల వార్షికోత్సవవేడుకల్లో భాగంగా శనివారం మొదటిరోజు ఘనంగా ఉత్సవాలను నిర్వహించారు. పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వళన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, వినోద్‌రావు, రాకేశ్ ప్రసాద్, ప్రాచీ, వియుఎం ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలజీ తదితరులు పాల్గొన్నారు.

90శాతం వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోండి

-నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ టౌన్, మార్చి 16: రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిలను ఏక మొత్తంలో వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం కింద చెల్లించిన వారికి 90శాతం వడ్డీ మాఫీ చేసినందున ఈ అవకాశాన్ని నగరంలోని ఆస్తిపన్ను బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ బి.శ్రీనివాస్ కోరారు. శనివారం నగరపాలక సంస్థకు ఇందిరానగర్ లోని పెన్షనర్స్ భవన్‌కు సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలు 24ఏళ్లుగా రూ.9,11,503 ఉండగా వడ్డీ మాఫీ పథకం కింద పెన్షనర్స్ భవన ప్రతినిధులు 3,39,742లను చెక్కు రూపంలో కమిషనర్‌ను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వడ్డీ మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా వారికి రూ.5,71,761ల పన్ను మాఫీ అయిందని, దీన్ని ప్రతి ఒక్క బకాయిదారుడు గుర్తుంచుకొని మార్చి 31లోగా వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలని సూచించారు. ఒకవేళ ఆస్తిపన్ను బకాయిలను చెల్లించకుంటే ఆస్తులను జప్తు చేయడంతో పాటు మున్సిపల్ చట్ట ప్రకారంగా చర్యలను తీసుకుంటామన్నారు. ఆస్తి పన్నులను చెల్లించి నగర పాలక సంస్థకు, నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

నివాస గృహాలకు డిజిటల్ డోర్ నంబర్లు కేటాయిస్తాం

-మేయర్ యాదగిరి సునీల్‌రావు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, మార్చి 16: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఇంటి నంబర్లకు డిజిటల్ నెంబర్లను కేటాయించే కార్యక్రమానికి శ్రీకారం చుడతామని మేయర్ యాదగిరి సునీల్‌రావు చెప్పారు. శనివారం 12 డివిజన్‌లోని శ్రీవేంకటేశ్వరకాలనీ రోడ్ నెంబర్-2లో మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.10లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను కార్పొరేటర్ తోట రాములు, 53వ డివిజన్ కాశ్మీరుగడ్డ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన కాలనీపేరుతో ఉన్న సైన్ బోర్డును కార్పొరేటర్ తుల శ్రీదేవిచంద్రమౌళితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇప్పటికే చాలా డివిజన్లలో కార్పొరేటర్లు, కాలనీ సంక్షేమ సంఘాల వారు కాలనీల సూచిక బోర్డులను ఏర్పాటు చేశారన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో డిజిటల్ ఇంటి నంబర్లను ఏర్పాటు చేస్తే మరింత సులభంగా అడ్రస్‌లు దొరుకుతాయని అన్నారు. 53వ డివిజన్‌లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు పూర్తిచేశామని, మరో 2 కోట్లతో పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు టెండర్లను పిలిచామని, వేసవిలోగా ఆ పనులను కూడా పూర్తిచేస్తామని అన్నారు. నగరంలో వేసవిలో కూడా ఇబ్బంది లేకుండా ప్రతి రోజు మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మేయర్ సునీల్‌రావు కోరారు. ఈకార్యక్రమంలో డివిజన్ ప్రజలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో తీర్మానాలపై చర్యలేవి?

● నిరసన తెలిపిన సభ్యులు



మండల సమావేశంలో నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు

చిగురుమామిడి, మార్చి 16: మండల కేంద్రంలో, చిన్నముల్కనూర్ గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన రెండు వైన్స్‌లపై, బొమ్మనపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన దుర్గా ఫౌల్ట్రీఫామ్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని మండల సర్వసభ్య సమావేశంలో శనివారం కొందరు ఎంపిటిసి సభ్యులు నేలపై కూర్చొని నిరసన తెలిపారు. స్థానిక ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ గత మండల సమావేశంలో చేసిన తీర్మానాలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. బొమ్మనపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఫౌల్ట్రీఫామ్ వల్ల రైతులు వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు పేర్కొన్నారు. మండలంలో బెల్టుషాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్నేహిత కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం ప్రజాప్రతినిధులకు ఇవ్వడం లేదని, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెల్లడం లేదని అధికారుల తీరుపై విమర్శలు చేశారు. ఎంపిటిసి సభ్యులు అందె స్వప్న, మంకు స్వప్న, ఎలేటి రవీందర్‌రెడ్డి, మిట్టపల్లి మల్లేశం, మెడబోయిన తిరుపతి, కొత్తురి సంధ్య, పెసరు జమున, కోఆప్షన్ సభ్యులు ఎండి మక్బుల్‌పాషా ఉన్నారు. మండల సమావేశంలో చర్చకు వచ్చిన ప్రతి సమస్యను అధికారులు పరిష్కరించాలని ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో బాశం మధుసూదన్, మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎండి ఖాజామొయినోద్దీన్ పాల్గొన్నారు.

వాగేశ్వరిలో వర్క్‌షాప్

తిమ్మాపూర్, మార్చి16: స్థానిక వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో యస్‌వి.గ్లోబల్ సర్వీసెస్ వారి సహకారంతో ఎడబ్ల్యూ అండ్ ఐఓటి ట్రైనింగ్ అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌నకు అమెజాన్ వెబ్ సర్వీస్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జనరల్ సెక్రటరీ జి.శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ డి.శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 876కేసుల పరిష్కారం

హుజూరాబాద్ లీగల్, మార్చి 16: హుజూరాబాద్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా 876 కేసులను పరిష్కరించినట్లు జడ్జీలు పి అలేఖ్య, పద్మసాయి, జి స్వాతిలు తెలిపారు. అనంతరం జడ్జీలు మాట్లాడుతూ రాజీమార్గమే రాజ మార్గమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంకణాల భగవాన్‌రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌జీ, టౌన్ సీఐ బొల్లం రమేష్, కేతిరి శ్రీనివాస్‌రెడ్డి, జి శ్రీనివాస్, అరుణ్‌కుమార్, గాయత్రీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తిమ్మాపూర్, మార్చి16 : సమండలంలోని కొత్తపల్లి గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని ఋణాలు, మహిళ సంఘా సభ్యురాలికి పది లక్షల రూ పాయల ప్రమాద బీమా, మహిళకు ఋణ బీమా పథకం ప్రతి యోట 5వేల గ్రామ సంఘాలకు 5వేల కోట్ల రూపాయలు ప్రకటించినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణ రెడ్డి, నాయ కులు పోలు రాము, నగునూరి శ్రీను, దొనపాటి మధు, పోలు రమేష్, సిసిలు చంద్రమౌళి, సంపత్ తదితరులు ఉన్నారు.

వరద కాలువకు నీటి విడుదల

గంగాధర, మార్చి 16: వరద కాలువ గేట్లు ఎత్తడంతో కాలువను ఆధారం చేసుకుని సాగు చేసిన రైతులకు కొంత ఊరట లభించింది. వరద కాలువకు నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు ఎమ్మెల్యే మేడిపల్లిసత్యంకు విజ్ఞప్తి చేశారు. నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి ఎమ్మెల్యే సత్యం రైతుల పరిస్థితిని వివరించారు. శనివారం అధికారులు నాగిరెడ్డిపూర్ గేట్లు ఎత్తడంతో దిగువకు నీరు పోతోంది. కాలువకు వరద నీరు రావడంతో నాగిరెడ్డిపూర్, కొండన్నపల్లి, కురిక్యాల, తాడిజెర్రి, రంగరావుపల్లి, గర్షకుర్తి, ఆచంపల్లి గ్రామాల రైతులకు వారం రోజుల పాటు సరిపడా నీరు చేరింది. లక్ష్మిపూర్ పంపులు ఆన్ చేసి కాలువకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

గన్నేరువరం, మార్చి 16, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం కాంగ్రెస్ నాయకులు శ్రీకారం చుట్టారు. మైలారంలో మున్నూరుకాపు సంఘ భవనానికి రూ.5లక్షల నిధులు, మాదాపూర్‌లో బోరింగ్ పైప్‌లైన్, ప్రాథమిక పాఠశాలకు మరమ్మతులు, ఖాసింపేటలో ప్రభుత్వ పాఠశాలకు పెయింటింగ్, కరెంట్ ఫిటింగ్, వార్డులలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, పీచుపల్లిలో మినరల్ వాటర్ ప్లాంట్, జంగపల్లిలో కురుమ సంఘం కమిటీ హాల్ నిర్మాణ పనులకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

హుజూరాబాద్, మార్చి 16: ఈ నెల 18వ తేదీ నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో తెలిపారు. హుజూరాబాద్ మండలంలో 5పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలని పేర్కొన్నారు.

● జమ్మికుంట: పదవ తరగతి పరీక్షలు ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల నుండి 339మంది, ప్రైవేట్ పాఠశాలల నుండి 622మంది, మొత్తం 961మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు.

● ఇల్లందకుంట: ఈ నెల 18నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, టేకుర్తి మోడల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రెండు సెంటర్లలో 146మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మొత్తం ఆరు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సుడా చైర్మన్‌గా కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మార్చి 17: శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రస్తుత కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఎన్ఎస్ యూఐ, యువజన కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశాడు. రాష్ట్ర గిడ్డంగులు సంస్థ డైరెక్టర్ గా, చైర్మన్‌గా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ విధేయతకు గుర్తింపుగా నరేందర్ రెడ్డికి సుడా చైర్మన్ పదవి వచ్చిందని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● మహిళా కమిషన్ చైర్మన్‌గా నేరెళ్ల శారద

మాజీ జడ్పీటీసీ, సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు నేరెళ్ల శారద రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, మార్చి16: నగరంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. 11కెవి ఉజ్వలపార్క్ ఫీడర్‌లో ఎన్టీఆర్ విగ్రహం, హనుమాన్ నగర్, ఉజ్వలపార్క్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

జిల్లా జైలు సూపరింటెండెంట్ పదోన్నతి బదిలీ

కరీంనగర్ క్రైం, మార్చి16: కరీంనగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ జి సమ్మయ్య పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ మేరకు జైళ్ళ శాఖ నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సమ్మయ్య చర్లపల్లి ఓపెన్ జైలు సూపరింటెండెంట్(ఎస్పీ)గా బదిలీపై వెళ్లారు. కరీంనగర్ జిల్లా జైళ్ళ అధికారి కె శ్రీనివాస్‌కు ప్రస్తుతం కరీంనగర్ జిల్లా జైలు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ డే

కరీంనగర్ రూరల్, మార్చి 16: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురు కుల మహిళా డిగ్రీ కళాశాల నగునూరులో శనివారం వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. శాతవాహనన విశ్వవిద్యాలయం కామర్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ డి.హరికాంత్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సమత కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుష్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.లావణ్య పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిరుపతిరెడ్డి

కరీంనగర్ టౌన్, మార్చి 16: పీఆర్‌టీయు తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కేతిరి తిరుపతిరెడ్డిని నియమిస్తూ పీఆర్‌టీయు రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, పర్వతి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా నియమితుడైన తిరుపతిరెడ్డిని యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కిషన్, రాష్ట్ర, జిల్లా నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్, రాంరెడ్డి, నాగరాజు, భూపతి తదితరులు అభినందించారు.

స్వప్నం రాల్చిన అమృతం నాటికకు బహుమతులు

కరీంనగర్ కల్చరల్, మార్చి 16: ఈ నెల 12 నుంచి 14 వరకు తెర్రాలో చైతన్య కళా సమాఖ్య నిర్వహించిన జాతీయ స్థాయి నాటిక పోటీల్లో కరీంనగర్ చైతన్యకళాభారతి వారు ప్రదర్శించిన 'స్వప్నం రాల్చిన అమృతం' నాటికకు నాలుగు బహుమతులు దక్కాయి. ఉత్తమ ద్వితీయ ప్రదర్శన, ఉత్తమ నటి జ్యోతి, ఉత్తమ దర్శకుడు మంచాల రమేశ్, స్పెషల్ జ్యూరీ కొత్తకొండ సత్యనారాయణ బహుమతులు గెలుచుకున్నారని సంస్థ అధ్యక్షుడు తిప్పర్తి ప్రభాకర్ తెలిపారు. పరమాత్ముని శివరాం రచించిన ఈ నాటికలో కొత్తకొండ సత్యనారాయణ, సుప్రియ, జ్యోతి, నటించారని, సంగీతం సురభి నాగరాజు, ఆహార్యం, రంగాలంకరణ కేదారి నాగు అందించారని తెలిపారు. బహుమతులు రావడం పట్ల పలు కళా సంస్థల బాధ్యులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు వసతులు ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్, మార్చి 16: ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు మౌళిక వసతులు ఏర్పాటు చేయాలని తెలంగాణ విద్యార్థి యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కర్ర శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడారు.

సమాజంలో ఉన్న రుగ్మతలను తొలగించాలి

సైదాపూర్, మార్చి 16: సమాజంలో ఉన్నటువంటి రుగ్మతలను గుర్తించి వాటిని తొలగించడంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముందుండాలని సైదాపూర్ ఎంపీడీవో యాదగిరి అన్నారు. శక్రవారం వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సమ్మర్ క్యాంపులో భాగంగా చివరి రోజు బాల్య వివాహాల నిర్మూలనపై లస్మన్నపల్లి గ్రామంలో అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ తీసీ మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ప్రొఫేసర్ రామ్మోహన్, పముఖ కాలమిస్ట్, జర్నలిస్ట్ ఎడమ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ఉన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

సైదాపూర్, మార్చి 16: మండలంలోని ఘనపూర్ గ్రామంలో రూ. 10లక్షల ఈజీఎస్ వర్క్ ద్వారా నిర్మించే సీసీ రోడ్డు పనులకు గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీవో సురేందర్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, భువనచంద్ర, నాయకులు గణేష్, గొమురెల్లి ఉన్నారు.

నూర్‌భాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

జమ్మికుంట రూరల్, మార్చి 16: తెలంగాణ రాష్ట్రంలో నూర్‌భాషా దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆల్ బీసీ మైనార్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అంకూస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం జనాభాలో అంతర్భాగమైన దూదేకుల జనాభా దాదాపు 70శాతం ఉంటుందన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

మానకొండూర్, మార్చి 16 : మండలంలోని కెల్లేడు ఎంపీటీసీ, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు గోపు రవీందర్‌రెడ్డి శనివారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

● సంక్షిప్త సమాచారం..

● చొప్పదండి: చొప్పదండిలోని శ్రీశివకేశవ దేవస్థానం ఆనువంశిక అర్చక సంక్షేమ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సింహాచలం ప్రభాకారాచార్యులు, ప్రధాన కార్యదర్శిగా జనగామ సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా సింహాచలం హరికృష్ణను ఎన్నుకున్నారు.

● చొప్పదండి: చొప్పదండి బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొంకటి శేఖర్ శనివారం రాజీనామా చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేశారు.

● జమ్మికుంట రూరల్: కాంగ్రెస్ నుండి పెద్దపల్లి ఎంపి టికెట్‌ను ప్రజా సంఘాల జేఏసి చైర్మన్ గజ్జెల కాంతంకు ఇవ్వాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ ఇంచార్జ్ సాగర్ అన్నారు.